# యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ



తిరుమాఢవీధుల్లో భక్తుల కోలాహలం

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 11: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. గురువారం సెలవుదినం కావడంతో పంచనారసింహుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. స్వామివారి ధర్మదర్శనానికి 3 గంటలు, వీవీఐపీ దర్శనానికి 2గంటల సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణతంతు వైభవంగా జరిగింది. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.40,21,609 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సీతారామచంద్రస్వామి వసంత నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజు సీతారామ హనుమత్ మూలమంత్ర జపాలు, దశశాంతి పంచసూక్త పారాయణాలతో అభిషేకం, ఆధ్యాత్మరామాయణ పారాయణం, సీతారామ హనుమత్ మూర్తులకు అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు.

# ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఆలేరు రూరల్, ఏప్రిల్ 11 : కొలనుపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూలీలకు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది గంగుల లలిత, ఆకుల రాధిక, స్వరూప పాల్గొన్నారు.

## 'బంగారు ఆభరణాలు ధరించి ఆరుబయట పడుకోవద్దు'

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 11: విలువైన బంగారు ఆరణాలు ధరించి ఆరుబయట గానీ, డాబాలపైన గానీ నిద్రించవద్దని ఎస్ఐ నాగరాజు సూచించారు. గురువారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పర్యటించి దొంగతనాల నియంత్రణపై ప్రజలకు సూచనలు చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో నియమించిన వలంటీర్లు అర్ధరాత్రి దాటే వరకు గస్తీ తిరుగుతుండడం అభినందనీయమన్నారు.



ఆత్మకూరు(ఎం)లో దొంగతనాల నియంత్రణపై ప్రజలకు వివరిస్తున్న ఎస్ఐ నాగరాజు




సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి

## రాజకీయ దురుద్దేశంతోనే కక్ష సాధింపు చర్యలు

- సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్, ఏప్రిల్ 11 : రాజకీయ దురుద్దేశంతోనే తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు తనపై తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. ట్రిబ్యునల్ కోర్టు సైతం వాటిని తప్పుడు ఆరోపణలుగా తేల్చిందని అన్నారు. దాంతో తిరిగి తనకు సింగిల్‌విండో బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సొసైటీ అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. ఉమ్మడి జిల్లాలోనే చౌటుప్పల్ సొసైటీని మొదటిస్థానంలో నిలిపానని తెలిపారు. తాను అవినీతికి పాల్పడ్డానని కొంతమంది సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని గుర్తు చేశారు. వారిపై పరువు నష్టం దావా వేయనున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ దుబ్బాక శశిధర్‌రెడ్డి, ఢిల్లీ మాధవరెడ్డి, కొత్త పర్వతాలుయాదవ్, గుండెబోయిన మల్లేశ్ యాదవ్, వెంకటేశ్ యాదవ్ తదితరులుపాల్గొన్నారు.



తాగునీటి వినియోగంపై వెంకటాపురం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న శ్యాంసుందర్

## గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్

తుర్కపల్లి, ఏప్రిల్11 : వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్ సూచించారు. మండలంలోని వెంకటాపురం, వేల్పుపల్లి, గుజ్జవాణికుంటతండా, మోతీరాం తండాలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్యలపై గ్రామస్తులతో చర్చించారు.

మిషన్ భగీరథ నీటి సరఫరా తగ్గితే గ్రామాల్లోని బోర్లు లీజుకు తీసుకుని వినియోగించుకోవాలన్నారు.

# ఆనందోత్సాహాలతో రంజాన్

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 11 : ముస్లింలు రంజాన్ పర్వదిన వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఈద్గాహ్‌ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉపావాస దీక్షలు విరమించారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివిధ పార్టీల నాయకులు ముస్లింలకు రంజాన్ విషెస్ చెప్పారు.

ఆలేరులోని ఈద్గాహ్ వద్ద ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. భువనగిరి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా సమీపంలోని ఈద్గాహ్, పెద్ద చెరువు కట్ట సమీపంలోని ఈద్గాహ్ వద్ద ప్రార్థనలు చేశారు. జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



రాజాపేట : పాముకుంటలో ఈద్గాహ్ వద్ద పార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



భువనగిరి అర్బన్ : రంజాన్ వేడుకల్లో పాల్గొన్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్



ఆలేరు : ఈద్గాహ్ వద్ద ప్రార్థనలో పాల్గొని మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



చౌటుప్పల్ : లక్కారం ఈద్గాహ్‌లో ముస్లింల ప్రార్థనలు



మోటకొండూరు : రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు



తుర్కపల్లి : రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



వలిగొండ : ఈద్గాహ్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బీబీనగర్ : ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



రామన్నపేటలో..



గుండాల : ఈద్గాహ్ వద్ద ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

# జ్యోతిరావు పూలేకు ఘన నివాళి



ఆలేరు : జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 11 : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. వివిధ పార్టీలు, కుల సంఘాల ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఆలేరు పట్టణంలో ఆయన విగ్రహానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ నాయకులు వేర్వేరుగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భరతమాత ముద్దుబిడ్డ, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, అంటరానితనాన్ని రూపుమాపేందుకు కృషి చేసిన గొప్ప సామాజిక సంస్కర్తగా కొనియాడారు. భువనగిరిలోని జగదేవ్‌పూర్ చౌరస్తా సమీపంలోని పూలే విగ్రహానికి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ నివాళి అర్పించారు. అలాగే ఆత్మకూర్(ఎం)లో బీఆర్ఎస్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన పూలే ఆశయాల సాధనకు నేటి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు.



భువనగిరి అర్బన్ : పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్



వలిగొండ : మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు



తుర్కపల్లి : మాదాపురంలో నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



ఆలేరు రూరల్ : కొలనుపాకలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు



అడ్డగూడూరు : పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మహనీయుల ఉత్సవ సమితి నాయకులు



రాజాపేట : పూలే ఫ్లెక్సీ వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

# పలు కుటుంబాలకు పరామర్శ

మోటకొండూర్, ఏప్రిల్ 11 : మండలంలోని వర్టూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి తండ్రి గూడూరు రాంరెడ్డి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్ గురువారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రాంరెడ్డి మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు సూదగాని రాందాస్, యంపల్ల రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఎల్లయ్య, వెంకట్‌రెడ్డి, మైసయ్య, శ్రీనివాస్, అశోక్ ఉన్నారు.

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణకేంద్రానికి చెందిన బొడ్డు నర్సింహ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను గురువారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత పరామర్శించి వారికి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు.

## రాగిజావ పంపిణీ

బీబీనగర్, ఏప్రిల్ 11 : మండల కేంద్రంలో బాంబినో ఫుడ్స్ పరిశ్రమ ఆధ్వర్యంలో రాగి జావ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని గోలి పింగళ్‌రెడ్డి ప్రారంభించారు. నాయకులు పోటోళ్ల శ్యాంగౌడ్, మల్లగారి శ్రీనివాస్, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.



రాగి జావ పంపిణీ చేస్తున్న పింగళ్‌రెడ్డి

## రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం : రాంరెడ్డి

వేములపల్లి, ఏప్రిల్ 11 : రైతు సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని రైతు సంఘం నాయకుడు పాల్వాయి రాంరెడ్డి అన్నారు. గురువారం ఆలిండియా కిసాన్ సంఘ్ ఆవిర్భావం సందర్భంగా మండల కేంద్రంలో సంఘం జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేసేలా చట్టాలు చేస్తుందన్నారు. ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రొండి శ్రీనివాస్, కోడిరెక్క వెంకన్న, గోవర్ధన్, సైదులు, నారాయణ, భిక్షం పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ మండలాధ్యక్ష పదవికి రాజీనామా

రాజాపేట, ఏప్రిల్ 11 : బీఆర్ఎస్ మండలాధ్యక్ష పదవి నుంచి వైదొలుగుతున్నట్లు కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య రీత్యా పదవి నుంచి వైదొలుగుతున్నానని, సమర్థవంతమైన మరో నాయకుడికి బాధ్యతలను అప్పగించాలని ఓ లేఖలో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డికి విన్నవించుకున్నారు.

## భువనగిరిలో బీఆర్ఎస్‌దే గెలుపు

-ఆ పార్టీ యువజన నాయకుడు కృష్ణ

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్11 : భువనగిరి ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందడం ఖాయమని ఆ పార్టీ యువజన నాయకుడు ఉప్పు కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారంలో ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజాసేవలో, ప్రజా ఉద్యమాల్లో ఉండే పార్టీ బీఆర్ఎస్ అని, పార్లమెంట్‌లో తెలంగాణ విభజన సమస్యలపై కొట్లాడేందుకు బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ గెలిచినా తెలంగాణకు ఒరిగేది ఏమీ ఉండదని, గత ఎన్నికల్లో గెలిచి వాళ్లు సాధించింది శూన్యమని తెలిపారు. క్యామ మల్లేశ్ విజయానికి కృషి చేయాలని కోరారు.

## కాటేపల్లిలో పుస్తెలతాడు చోరీ

మోటకొండూర్, ఏప్రిల్ 11 : మండలంలోని కాటేపల్లిలో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఇంటిపై నిద్రిస్తున్న మహిళ మెడ నుంచి బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని దుండగుడు అపహరించుకెళ్లాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డం నిర్మల రోజు మాదిరిగా కుటుంబసభ్యులతో కలిసి ఇంటిపై పడుకుంది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నిర్మల మెడలో ఉన్న మూడున్నర తులాల పుస్తెలతాడును లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## దొంగలను పట్టిస్తే పారితోషికం

భువనగిరి : వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులను పట్టించిన వారికి రూ.25వేల పారితోషికం ఇచ్చి సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మోటకొండూరు మండలం కాటేపల్లి, భువనగిరి మండలం చీమల కొండూరు, నాగిరెడ్డిపల్లిలో ఇండ్లపై నిద్రిస్తున్న మహిళల నుంచి పుస్తెలతాళ్లను అపహరించుకుపోయిన దుండగులను గుర్తిస్తే వెంటనే సమాచారాన్ని అందించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులుగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

బీబీనగర్ : వేసవిలో రాత్రిపూట ఆరుబయట నిద్రించే వారు దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేశ్ అన్నారు. మండలంలోని గొల్లగూడెంలో ఉపాధి హామీ కూలీలకు చైన్ స్నాచింగ్, పశువుల అపహరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ మండలాల్లో పుస్తెలతాళ్లు అపహరించుకెళ్లిన ఘటనలు జరుగుతున్నాయని, ప్రజలు ఎక్కడికి వెళ్లినా ఒంటరిగా వెళ్లొద్దని సూచించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరించినప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



బీబీనగర్ : గొల్లగూడెం ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేశ్